AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

ఘనంగా వసంత పంచమి



2



2

127 ఫోన్ల రికవరీ

## మైనారిటీ రెసిడెన్షియల్‌లో అడ్మిషన్లు ప్రారంభం



**అక్షరటుడే, బోధన్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్‌లోని పాఠశాలలో అడ్మిషన్ల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతి మైనారిటీ విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మైనారిటీ రెసిడెన్షియల్ అధికారులు పాల్గొన్నారు.



## రుణాలను రికవరీ చేయాలి




**అక్షరటుడే, కామారెడ్డి :** ఆర్థిక సంవత్సరం ముగింపులోగా స్త్రీనిధి రుణాల రికవరీ లక్ష్యం చేరుకోవాలని స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి సూచించారు. డీఆర్డీవో, డీఆర్డీఏ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో సెర్ప్, స్త్రీనిధి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు.సెర్ప్ రుణాల రికవరీలో జిల్లా ముందంజలో ఉందని అభినందించారు. రెండు సంస్థల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. క్లస్టర్ వారీగా ఓవర్‌డ్యూ ఉన్న మహిళా సంఘాలు, సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. ఓవర్‌డ్యూ ఉన్న సిబ్బంది, మండలాలను సమీక్షించాలని సూచించారు. ప్రతి మంగళవారం, గురువారం రోజులను రికవరీ డేగా పాటిస్తూ, అన్ని ఫంక్షనరీలు రికవరీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, అడిషనల్ డీఆర్డీవో, డీపీఎంలు, స్త్రీనిధి డైరెక్టర్, స్త్రీనిధి జోనల్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి పట్టణాభివృద్ధికి కృషి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. ఈ మేరకు ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రొసీడింగ్ కాపీలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకెళ్తోందన్నారు. బస్టాండ్, మినీ ట్యాంక్ బండ్, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధిదీపాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకుంటామని, ఎల్లారెడ్డి పట్టణ సర్వతోముఖాభివృద్ధే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ అన్నారు. నిజాంసాగర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వసంత పంచమి సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

# గెలుపు గుర్రాల వేట..



**జిల్లాలో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. ఇంకా షెడ్యూల్ విడుదల కాకున్నా.. రిజర్వేషన్లు ఖరారు కావడంతో రాజకీయ వేడి మొదలైంది. ఆయా వార్డుల్లో టికెట్ కోసం ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలు సైతం అన్ని విధాలుగా బలమైన నేతలకు టికెట్ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నాయి. జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయి.** – అక్షరటుడే, భీమ్‌గల్

■ అభ్యర్థుల కోసం పార్టీల అన్వేషణ ■ బలమైన నేతలను బరిలో దింపే యోచన ■ పాత, కొత్త నేతల మధ్య సీట్ల పేచీ..

జిల్లాలో ఈ సారి పురపోరు రసవత్తరంగా సాగనుంది. అన్ని స్థానాల్లో అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ బలంగా ఉండనుంది. నిజామాబాద్‌తో పాటు, బోధన్‌లో ఎంఐఎం పార్టీ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆయా పార్టీలు మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. ఇందులో భాగంగా అభ్యర్థుల ఎంపికలో పార్టీలు ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ప్రధానంగా ఆర్థిక పుష్టి, సామాజిక సమీకరణాలు, గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నాయి.

### ఇందూరుపై ఫోకస్

నిజామాబాద్ మేయర్ పీఠం ఈసారి జనరల్ మహిళకు రిజర్వు కావడంతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సొంత జిల్లా కావడంతో ఇక్కడ గెలుపును కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అవసరమైతే ఎంఐఎంతో పొత్తు పెట్టుకుని మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే ఆలోచనలో ఉంది. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బీజేపీ వారు కావడంతో.. మేయర్ పదవిని గెలుచుకొని పట్టు నిలుపుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. అభ్యర్థుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయి బలాన్ని అంచనా వేస్తున్నారు. గతంలో మేయర్ పీఠం దక్కించుకున్న గులాబీ పార్టీ.. ఈ సారి అభ్యర్థుల ఎంపికలో సర్వే రిపోర్టులనే నమ్ముకుంది.

**మున్సిపాలిటీల వివరాలు**

| మున్సిపాలిటీ | వార్డులు |
|---|---|
| నిజామాబాద్ | 60 |
| బోధన్ | 38 |
| ఆర్మూర్ | 36 |
| భీమ్‌గల్ | 12 |

### ఆర్థికంగా బలంగా ఉన్నవారికే..

మున్సిపల్ ఎన్నికల్లో ఖర్చు పెరిగిన నేపథ్యంలో, ఎన్నికల వ్యయాన్ని భరించే అభ్యర్థుల వైపే పార్టీలు మొగ్గు చూపుతున్నాయి. "ఖర్చు మాది.. టికెట్ మీది" అనే వారు క్యూ కడుతున్నారు. టికెట్ ఖరారు కాకముందే ఆశావహులు వార్డుల్లో 'మార్నింగ్ వాక్'లు, టీ పార్టీలతో సందడి చేస్తున్నారు. ప్రధాన పార్టీల్లో ఆశావహులు ఎక్కువ కావడంతో, టికెట్ దక్కని వారు స్వతంత్రులుగా లేదా ఇతర పార్టీల నుంచి బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఇది పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. వచ్చే రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది.

## ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రామగుండం పురపాలక సంఘం అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సెక్రెటరీగా విధులు నిర్వహించిన ఆయనను ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా వ్యవహరించిన పూజారి శ్రావణి హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరుగుతున్న శిక్షణకు వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆమె స్థానంలో ఉమామహేశ్వరరావు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికారు. రానున్న మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరు సహకారాలు అందించాలని ఆయన కోరారు.

## నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలి



**అక్షరటుడే, ఇందూరు :** వాహనదారులు నిబంధనలను పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ సూచించారు. నగరంలోని వినాయకనగర్‌లో శుక్రవారం రహదారి భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. ప్రతి విద్యార్థి ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. సుమారు 500 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రుక్మిణి చాంబర్స్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ కిరణ్ కుమార్, ఏఎంవీఐ శృతి, ఆర్టీఏ సభ్యులు రాజా నరేందర్ గౌడ్, ఈడార్ మేనేజర్ వర్ష తదితరులు పాల్గొన్నారు.

## ఫేక్ కరెన్సీ ముఠా సభ్యుడిపై పీడీ యాక్టు నమోదు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో నకిలీ నోట్ల ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. వైన్ షాపులో లభించిన రెండు నకిలీ నోట్ల ఆధారంగా వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ఢిల్లీ, మహారాష్ట్ర, రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో ఆపరేషన్ కొనసాగించి ముఠా గుట్టురట్టు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు 14 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు ముఠా సభ్యుల్లో తొమ్మిది మందిపై పీడీ యాక్టు నమోదు చేశారు. తాజాగా ముఠాలోని చత్రం ఆదిత్యపై పీడీ యాక్టు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వుల కాపీని పట్టణ సీఐ నరహరి, జిల్లా పీడీ సెల్ ఇన్‌ఛార్జి నర్సింలు నిజామాబాద్ జైలులో ఉన్న నిందితుడికి అందజేశారు.

## పోలీసులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ కంఠేశ్వర్‌లో నిజామాబాద్ రూరల్, మాక్లూర్ పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర రహిత సమాజం సీసీ కెమెరాల నిఘా, క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ పెంచడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని డీజీపీ తెలిపారు. నూతన భవనాల్లో సిబ్బందికి మెరుగైన పని వాతావరణం లభిస్తుందని, ఇది వారి పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ విషయంలో ప్రజలను ముఖ్యంగా యువతను చైతన్యపర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఐజీ మల్టీజోన్-1 చంద్రశేఖర్, సీపీ సాయి చైతన్య ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### శాంతిభద్రతల పరిరక్షణలో..

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు పోషిస్తున్న పాత్ర అమోఘమన్నారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకే అత్యాధునిక వసతులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు శాఖ ఆధునీకరణకు కట్టుబడి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న పోలీస్ స్టేషన్ల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి భరోసా ఇచ్చేలా సిబ్బంది ప్రవర్తించాలని, త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

### పోలీసు వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వ ప్రాధాన్యత..

ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు అవసరమని, కంఠేశ్వర్ ప్రాంత ప్రజలకు ఈ రూరల్ పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు.

## యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థుల కోసం నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రోగ్రాంకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదని, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం ఉన్నప్పుడే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా విద్యార్థులు స్థానికంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

### సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కూడా హైటెక్ నైపుణ్యాలు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన పేర్కొన్నారు. అనంతరం కాకతీయ విద్యాసంస్థల అధినేత రజనీకాంత్, విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత నరేందర్ రెడ్డి తదితరులు షబ్బీర్‌అలీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలి : కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి:** గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో ఉన్న ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల వెలుపల డ్రెయినేజీ సమస్యతో పాఠశాల పరిసరాల్లో అసౌకర్యం ఏర్పడుతున్నట్లు గుర్తించిన కలెక్టర్ తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి అవసరమైన మరమ్మతులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిశుభ్రత పాటించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలో విద్యా బోధన, వసతి సదుపాయాలు, భోజన ఏర్పాట్లు, స్టోర్ రూమ్ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులను భోజన వసతులపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్ విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గిరిజన సంక్షేమ శాఖ అధికారి సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహశీల్దార్ జనార్దన్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




నగరంలోని ఇంద్రాణి స్కూల్‌లో వసంత పంచమి వేడుకలు


ఆర్మూర్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో..


బాల్కొండ మండల కేంద్రంలో..

# ఘనంగా వసంత పంచమి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వసంత పంచమి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి మాత ఆలయాలు, పలు పాఠశాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాకుండా విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆర్మూర్‌లో సరస్వతి శిశుమందిర్‌లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.**

**–అక్షరటుడే, నెట్‌వర్క్**


ఆర్మూర్‌లోని సరస్వతీమాత ఆలయంలో అక్షరాభ్యాసం


ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్‌లోని రామాలయంలో..


గాంధారి మండలంలో..


లింగంపేట మండలంలో..


ఆర్మూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో..


బాల్కొండ మండల కేంద్రంలో..


ఆర్మూర్ సరస్వతీమాత ఆలయంలో ..


బాల్కొండ మండల కేంద్రంలో..

## జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ



**అక్షరటుడే, ఇందూరు:** జీజీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మార్చి 6న 'తెలుగు మాండలిక సాహిత్య వికాసం, విస్తృతి, వైవిధ్యం' అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.రంగరత్నం, సదస్సు కన్వీనర్ లెఫ్టినెంట్ రామస్వామితో కలిసి విడుదల చేశారు. వివిధ మాండలికాలతో వెలువడిన సాహిత్యాన్ని, ప్రక్రియలను అధ్యయనం చేసే ఉద్దేశంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు రామస్వామి తెలియజేశారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ నహీదబేగం, ఐక్యూఏసి కోఆర్డినేటర్ రాజేష్, పీఆర్‌వో దండు స్వామి, కామర్స్, బీబీఏ అధిపతులు వినయ్ కుమార్, రంజిత, ముత్తెన్న, చంద్రశేఖర్, రమేష్ గౌడ్, రాహుల్, సుభాషిణి దేవి, రామకృష్ణ, పూర్ణచందర్ రావు, బాలమణి, శమంత, గంగాధర్, రాజేశ్వర్, శ్రీనివాస్, అర్చన, కార్యాలయ సిబ్బంది ఏవో రామ్ కిషన్, సూపరింటెండ్ ఉదయభాస్కర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలి: అదనపు కలెక్టర్ కిరణ్



**అక్షరటుడే, ఇందూరు:** ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ పాల్గొన్నారు.

### పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో..

**ముప్కాల్:** మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముప్కాల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తహశీల్దార్ ముంతాజుద్దీన్, ఎంపీవో మోహినుద్దీన్, ఎంఈవో రవి, ప్రధానోపాధ్యాయులు గంగారాం, కేజీబీవీ ఎస్‌హెచ్‌వో వినోద, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్‌తో 127 ఫోన్ల రికవరీ: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న 127 ఫోన్లను పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రికవరీ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర శుక్రవారం పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గతేడాది రూ.3 కోట్ల విలువైన 1,834 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. ఇప్పటివరకు రూ.7.05 కోట్ల విలువైన ఫోన్లు బాధితులకు అప్పగించామన్నారు. గత 15 రోజుల్లో రూ.20.32 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను స్పెషల్ డ్రైవ్ ద్వారా రికవరీ చేశామన్నారు. మొబైల్ కేంద్రంగా సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ఫోన్ వినియోగించడంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫోన్ పోతే ఆందోళన వద్దని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి పొందవచ్చని తెలిపారు. రికవరీ అయిన ఫోన్లను బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఫోన్లు తీసుకెళ్లాలని సూచించారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ అన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో శుక్రవారం మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా ఓటరు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. దేశ పౌరుడిగా బాధ్యతను నిర్వర్తిస్తూ.. మతం, కులం, వర్గం, భాష వంటి అంశాలకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేయాలని ఏలె మల్లికార్జున్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు, ఉపాధ్యాయులు తదితరులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ , ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించేలా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వసంత పంచమి సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు.

## నేతాజీ జీవితం యువతకు ఆదర్శం


కామారెడ్డిలో తపస్ ఆధ్వర్యంలో..


గాంధారిలో..

**అక్షరటుడే, కామారెడ్డి:** నేతాజీ జీవితం యువతకు ఆదర్శమని తపస్ రాష్ట్ర కార్యదర్శి రాఘవరెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశభక్తి, త్యాగం, క్రమశిక్షణ, నాయకత్వ గుణాలకు ఆయన జీవితం సజీవ ఉదాహరణ అని తెలిపారు. స్వాతంత్ర్య సాధన కోసం ఆయన చూపిన ధైర్యసాహసాలు, అచంచలమైన సంకల్పం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. యువత దేశసేవ చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా బాధ్యులు లక్ష్మీపతి, వివిధ మండలాల బాధ్యులు భాస్కరాచారి, స్వామి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

**అక్షరటుడే, గాంధారి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలోసుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు నేరెళ్ల సంతోష్, ఉపాధ్యక్షుడు చీమల్ వార్ శ్రీనివాస్, దోళ్ళ లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీలు రాకేష్, సామల రాజు, టౌన్ ఉపాధ్యక్షుడు తాటిపాముల శివ, సెక్రెటరీ అరెకటిక మోతిలాల్, తూర్పు రమేష్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ఆకుల రాకేష్ పాల్గొన్నారు.

## నందిపేట్‌లో దొంగల బీభత్సం



**అక్షరటుడే, ఆర్మూర్ :** అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. నందిపేట్ మండల కేంద్రంలోని మూడు ప్రముఖ ఆలయాల్లోకి చొరబడి హుండీలను పగులకొట్టి నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం, మార్కండేయ ఆలయం, దేవమ్మ ఆలయాల్లో దొంగలు వరుసగా చోరీలకు పాల్పడ్డారు. ఆలయాల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు, హుండీలను పగలకొట్టి అందులో ఉన్న నగదును తీసుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ఆలయాలకు వచ్చిన భక్తులు చోరీ విషయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వరుసగా ఆలయాల్లో చోరీలు జరగడంతో భక్తులు, స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆలయాల్లో భద్రత పెంచాలని, దొంగలను వెంటనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## ఇందిరమ్మ కాలనీలో బోరుబావి తవ్వకం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని జలాల్పూర్ గ్రామంలో గల ఇందిరమ్మ కాలనీలో సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బోరుబావి తవ్వకం ప్రారంభించారు. దీంతో కాలనీలో నీటిసమస్య పరిష్కారమవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మూగ భోజన్న, కుంట శేఖర్, రాటం సాగర్, నాగేష్, గుండు రాజేందర్, సుద్దపల్లి గంగు, ప్యాట్ల గంగుబాయి, ఉల్లంగ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, కారోబార్ వేణుగోపాల్, ప్రదీప్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## రెంజర్లలో స్నానగట్టం నిర్మాణానికి భూమి పూజ

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలో స్నానగట్టం నిర్మాణం కోసం సర్పంచ్ లావణ్య భూమేష్, ఉప సర్పంచ్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు, వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. స్నాన గట్టం నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన దాత ఎన్ఆర్ఐ బుక శ్రీధర్‌ను గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.



## యువకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రానికి చెందిన యువకుడు రాజారామ్ అనిల్ కుమార్ గురువారం తన పొలం వద్ద గడ్డికోత యంత్రంలో చేయి ఇరుక్కుని తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో క్షతగాత్రుడిని హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో యువకుడి చెయ్యి తొలగించడంతో యువకుడిని శుక్రవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. యువకుడికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాగిరెడ్డిపేట మాజీ జెడ్పీటీసీ సభ్యులు మనోహర్ రెడ్డి, సాయిలు, సంజీవులు తదితరులు ఉన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జరిమానా



**అక్షరటుడే, బాల్కొండ:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి న్యాయస్థానం జరిమానా విధించింది. బాల్కొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరియాణా రాష్ట్రానికి చెందిన రాజేష్ సింగ్ అనే వ్యక్తి అధికంగా మద్యం సేవించి ఎన్‌హెచ్-44పై ప్రమాదకరంగా వాహనం నడుపుతున్నట్లు గుర్తించిన బాల్కొండ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడికి డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో రాజేష్ సింగ్‌ను ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా, న్యాయస్థానం రూ.10,000 జరిమానా విధించింది. మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యానేరమని, ఇది తనతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమని బాల్కొండ ఎస్సై శైలేందర్ హెచ్చరించారు. రహదారి భద్రత దృష్ట్యా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.